# మబ్బు విడిన చందమామ

- పద్మలతా జయరాం

"నాన్నా ! కథ" మర్చిపోలేదు చిన్నారి.

"నాన్నా ! రియల్ స్టోరీ కావాలి. చందమామ కథొద్దు" శివ డిమాండ్.

మల్లెల వాసన మత్తెక్కిస్తోంది మూర్తిని. పరుచుకున్న వెన్నెల నిద్రపోవద్దంటోంది. మల్లెలకీ, వెన్నెలకీ మధ్య ఉయ్యాల ఊగుతోంది మూర్తి మనసు.

"అబ్బా ! చెప్పు నాన్నా".

"సరే ! వినండి" పిల్లల పంతం నెగ్గింది.

✤ ✤ ✤

రైలు పట్టాల మీదుగా నడుస్తున్నాడు సత్యం. గమ్యం ఒక్కటే. జనం కనిపించని చోటు చూసుకుని రైలు క్రింద తల పెట్టడమే.

ఆత్మహత్య పిరికితనమే. కాని మరో గత్యంతరం కనబడనపుడు ? బ్రతుకుకు దారి కానరాకపోతే, చావు తప్ప మరో దారేది ? చావడానికి తేలిక మార్గం ఇదే అన్పిస్తోంది. ధైర్యం చేసి తలపెట్టేస్తే, తెలీకుండానే ప్రాణం పోతుంది. తను ఎంత ఆలోచించాడు ఈ మార్గం ఎన్నుకునే ముందు, కిరోసిన్ పోసుకుని తగలపెట్టేసుకుందామనుకున్నాడు. కాని పొరపాటున బ్రతికితే, సగం కాలిన ఆ శరీరంతో చావలేక బ్రతకాలి. ఉరి వేసుకుంటే "ఇంటిల్లిపాదీ పోలీసుకేసులో ఇరుక్కుంటారు". ఉంటున్న ఆ ఇంటిని ఖాళీచేసి పోవాల్సిన పరిస్థితి రావచ్చు. బ్రతికుండి వాళ్లని వేధించడమే కాక చచ్చికూడా వేధించినట్లవుతుంది. ఇంకా అనేక మార్గాలున్నా, తేలిక మార్గం ఇదే అన్పించింది. పొరపాటున జరిగిన ప్రమాదంగా భావిస్తారు.

వెనుకనుండి రైలు కూత వేసుకుంటూ రావడం విన్పిస్తోంది. ప్రాణాలుగ్గబట్టుకుని కళ్ళు మూసుకుని నడుస్తున్నాడు సత్యం పట్టాల మధ్యగా, దగ్గరగా వచ్చినట్లు

నిద్రకుపక్రమించింది నీరజ, క్రొత్త వెలుగులు నింపే రేపటి రోజుకోసం.

కొబ్బరి ఆకుల సందుల్లోంచి వెన్నెల వింత వెలుగులు చిలుకుతోంది. డాబా మీద పరిచిన ప్రక్కల మీద పరుపులా పరుచుకుంది వెన్నెల. విచ్చుకుంటున్న మల్లెల సువాసన, సన్నగా, వ్యాపిస్తున్న సంపెంగల సుగంధంతో కలిసి కొంగ్రొత్త పరిమళాలను సృష్టిస్తోంది. పగటి ఎండ తాలూకు వేడిమి మచ్చుకైనా లేదు. చల్లని చిరుగాలి, మనస్సుకి సైతం హాయినిస్తోంది.

"నాన్నా ! కథ చెప్పవూ !" తండ్రి మెడ చుట్టూ చెయ్యివేసి గోముగా అడిగింది చిన్నారి.

"ఊ! ఏం కథ చెప్పనూ .... చందమామ కథ చెప్పనా" కూతురిని దగ్గరికి తీసుకున్నాడు మూర్తి.

"నాన్నా ! చందమామ మాయమైపోయింది చూడు", మబ్బుల్లోకి వెళ్ళిపోయిన చందమామ కోసం వెతుకుతున్నాడు. శివ.

మంచినీళ్ళ చెంబుతో మేడ మీదికి వచ్చిన సీత అలికిడి విన్పించింది మూర్తికి, తల త్రిప్పకుండగానే "చందమామ వచ్చిందిగా " అన్నాడు.

"నాన్నా ! చందమామ కాదు, వచ్చింది అమ్మ" నవ్వింది చిన్నారి.

"ఇంకా నిద్దరోలేదూ" జడలో మల్లెలు సర్దుకుంటూ అడిగింది సీత.

"నువ్వు రానిదే".

"ష్" ! కళ్ళతోనే చిరుకోపాన్ని ప్రదర్శించి "ఇహ 'బజ్జోండి' రేపు తెల్లారగట్టా లేవాలి మీరు" నడుంవాలుస్తూ అంది సీత.

తెలుస్తూనే వుంది. చచ్చు బిడ్డట్టున్న కాళ్ళతో అక్కడే కూలబడ్డాడు. ఆశ్చర్యం ! తనకేం కాలేదు. కళ్ళు తెరిచి చూశాడు. రైలు తాలూకు ఆఖరి కంపార్ట్‌మెంట్ ప్రక్కనైను మీంచి పోతోంది. ఏడవాలో, నవ్వాలో తెలీలేదు సత్యానికి. దూరం నుండి ఎవరో పిల్చినట్లయింది. తలత్రిప్పి చూశాడు. వెనుక నుండి గబగబా నడుచుకుంటూ వస్తున్నాడో వ్యక్తి. దగ్గరగా వచ్చాక

"ఏందయ్యా ! కొంచెంలో చచ్చేవాడివి. ఏంది ఆలోచిస్తుండావు ? మీ అమ్మ కడుపు సల్లగా. ఫో. ఇంటికెళ్ళి ఆలోచించుకో. సదువుకున్న కుర్రోడులా గ్గనిపిస్తున్నావు. అమ్మా, అయ్యా వున్నారా, లేరా !" భుజం పట్టుకుని అడిగాడు. కూలివాడు కాబోలు, చేతిలో పార, పైకి కట్టిన ధోవతి అతని అవతారం. ఏ సమాధానం చెప్పలేదు సత్యం. పట్టాలు దాటి రోడ్డు మీదికి వెళ్ళిపోయాడు.

ఏమని చెప్పాలి ? ముప్పయ్యేళ్ళు దాటుతున్నా ఉద్యోగం లేకుండా తండ్రి సంపాదించే ఆ నాలుగు రాళ్ళతోనే తాను తిండి తింటున్నాననా. చదువుకున్న ఎమ్మే డిగ్రీ చేతులు తుడుచుకుంటానికి కూడా పనికిరావడం లేదనా ! ఏడుపు వస్తోంది సత్యానికి.

దగ్గర్లో వున్న బస్టాపులో విరిగిన కడ్డీల మీద కూర్చున్నాడు. కళ్ళని కప్పేసిన నీటిపొరలోంచి జనం మసక మసగ్గా కనిపిస్తున్నారు.

ముగ్గురు సంతానంలో పెద్దవాడు సత్యం. అమ్మ మాట మీరని వాడు. పొరపాటున కూడా తండ్రికి ఏనాడూ ఎదురు చెప్పలేదు. పాలిటెక్నిక్ చదివితే ఏదో ఒక ఉద్యోగం వస్తుందని తెలిసినా, తండ్రి "డిగ్రీ చదువు" అనగానే కిమ్మనకుండా చదివాడు. తర్వాత ఎమ్మేలో డిస్టింక్షన్ సంపాదించాడు. టైపు, షార్టుహాండ్ పూర్తి చేశాడు. కాని ఏం లాభం, తను సర్టిఫికెట్ తీసుకునే సమయానికి, వాటికి కాలం చెల్లిపోయింది. కంప్యూటర్ యుగం వచ్చేసింది. వేలకు వేలు పోసి ఆ కోర్సులు చేయాలంటే, తండ్రి సంపాదించేది ఏ మూలకి ? అప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టే ప్రతీ అర్హత పరీక్ష వ్రాసాడు. ఏ ఒక్కటీ రాలేదు, వందల రూపాయలు దరఖాస్తులకి ఖర్చయ్యిందే తప్ప. పది తప్పిన తమ్ముడు తనకన్నా ముందే ఉద్యోగస్థుడయ్యాడు. చదువు అబ్బలేదని వాడంతట వాడే, స్నేహితుడి తండ్రి సాయంతో సినిమా థియేటర్లో గేట్ కీపర్‌గా చేరి, అంచెలంచెలుగా థియేటర్ ఓనర్‌కి కుడిభుజమయ్యాడు. రెండేళ్ళలోనే వాడి బ్రతుకు వాడు బ్రతక గల్గుతున్నాడు. వాడి చూపులో కన్పించే తిరస్కార భావం, తనని క్రుంగదీస్తోంది. తండ్రిలో కూడా తన పట్ల కల అసమర్థుడు అన్న భావన స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకూ పనికిరాని, ఎవ్వరికీ అవసరం లేని ఈ బ్రతుకెందుకు ? అమ్మ ఏడుస్తుంది, కానియ్, ఉండి ఉద్ధరించలేనపుడు, పోవడమే మంచిది. ఆలోచనలతో, ఆందోళనతో నిండి వున్న సత్యం ఎవరో మాట్లాడించడంతో ఈ లోకంలోకి వచ్చాడు.

"కొద్దిగా జరుగు సార్. గీ జాగ నాది" పాతికేళ్ళ వ్యక్తి అడిగాడు సత్యాన్ని.

అప్రయత్నంగా లేచి నిల్చున్నాడు సత్యం. ఆ వ్యక్తి చేతులలోని సంచుల్ని క్రిందకి దింపాడు. ఒక సంచిలో మడిచిపెట్టిన స్టాండుని బయటకు తీసి రోడ్డు మీద అమర్చాడు. తన చింపిరి జుత్తుని చక చకా దువ్వి, అంచులు చిరిగిన చొక్కాని ప్యాంటులోకి దోపాడు. సంచిలో నుంచి కోటు తీసి వేసుకొని, నల్ల కళ్ళద్దాలు పెట్టుకున్నాడు. క్షణాల్లో అతని రూపం మారిపోయింది. ఇక సంచుల్లోనుంచి గిల్టునగలు, ఆడవాళ్ళు తలకి ధరించే రకరకాల బ్యాండ్లు, రిబ్బన్లూ, స్టిక్కర్లు, గాజులు వగైరాలన్నీ ఆ స్టాండు మీదికి చేర్చి వచ్చీరాని ఇంగ్లీష్‌లో గొంతుని వింతగా మార్చి

"హలో మేడమ్ ! ప్లీజ్ కమ్. వెల్‌కం. ఓన్లీ టెన్ రూపీస్. గోల్డ్ కవర్డ్ ఆర్నమెంట్స్. రండి మేడమ్ రండి సార్. ఈ చెయిన్ కొనివ్వండి, గోల్డ్‌దనుకుని మీ లవర్ ఠక్కున నమ్మేస్తుంది. ప్రామిస్" అరవసాగాడు.

సత్యం చూస్తూండగానే అక్కడ వచ్చిపోయే వాళ్ళందరూ అతని దగ్గర చేరడం, కొద్దిమంది కొనడం జరిగిపోయింది. ఇంకా జరుగుతూనే ఉంది. డబ్బు సంపాదన ఇంత తేలికా అనిపించింది సత్యానికి.

ప్రక్కకు వచ్చి నిల్చున్నాడు. ఆఫీస్ టైం అయినట్లుంది, జనం రద్దీ పెరిగింది. వచ్చే, పోయే వాహనాలను అవలీలగా తప్పించుకుంటూ దేకుతూ రోడ్డు దాటుతున్నాడు ఓ భిక్షగాడు. వాడు సరిగ్గా సత్యం నిల్చున్న ప్రదేశం దాకా వచ్చినపుడు కానీ సరిగ్గా తెలియలేదు, ఆ భిక్షగాడికి రెండు కాళ్ళూ, రెండు చేతులూ లేవు. కేవలం మొండెం మాత్రమే ఉంది. రోడ్డు మీద వెల్లకిలా పడుకుని అడుక్కోవడం మొదలుపెట్టాడు. వీడు ఎందుకు బ్రతుకుతున్నాడా అనిపించింది సత్యానికి.

''ఏంది బాబూ చూస్తా వున్నావు ? ఓ రూపాయెయ్యయ్యా, పుణ్యం వుంటుంది. అడిగాడు బిచ్చగాడు.

"లేవు ఇదిగో ఈ పావలా తీస్కో" జేబులో చెయ్యి పెట్టాడు సత్యం.

"ఒద్దులే నువ్వే వుంచుకో. రూపాయికి తక్కువేత్తే తీసుకోను" తిరస్కారంగా అన్నాడు.

"కోపం తెచ్చుకోలేదు సత్యం.

"నిన్నో మాట అడిగేదా !" బిచ్చగాడిని అడిగాడు.

ఏమిటన్నట్లు చూసాడు వాడు.

ఏం లేదు. కాళ్ళూ, చేతులూ లేవు. కూటికి లేక అడుక్కుంటున్నావు. నువ్వు బ్రతక్కపోతేనేం. ఏమీ అనుకోకు. నీకు చావాలనిపించడం లేదా !"

"ఎట్టోడిలా వున్నావే. సచ్చేదాక బతకాల గానీ సచ్చేందుకు బతకాల్నా ? నా కడుపుకి కావల్సినంత దొరుకుతూనే ఉంది. నాకు తెలిసిన దారి అడుక్కోటం, ఇచ్చినోళ్ళు ఇత్తారు, లేనోళ్ళు లేదు. ఫో, ఫోవయ్యా" మంచి బిజినెస్ టైంలో డిస్టర్బ్ చేసినందుకు విసుక్కున్నాడు భిక్షగాడు.

చావు గురించిన ఆలోచన దారి మళ్ళింది సత్యానికి. తెగని ఆలోచనలతో అలాగే నిల్చున్నాడు.

"ఆటో కావాలా సార్" అడిగాడు ఎదురుగా ఆటోని ఆపిన ఆటోవాలా.

తలెత్తి చూశాడు సత్యం. అతడు తమ ఇంటి దగ్గర కూలిపని చేసే ఎల్లమంద. అతనూ, సత్యాన్ని గుర్తు పట్టాడు.

"ఆటో ఎక్కుతారా సార్. ఎక్కడ కెల్లాలో చెప్పండి" మర్యాదగా అడిగాడు.

"వద్దులేగానీ, నువ్వు కూలిపని మానేసావా. ఆటో డ్రైవింగ్ చేస్తున్నావు".

"లేదు సార్. ఏ పని దొరికితే గాపని జెయ్యాల. కూలి దొరికిన్నాడు కూలికి బోతా. వాచ్‌మన్ పని దొరికితే ఆ పని చేస్తా. మిల్లు కాడ బస్తాలు మోస్తా. రిక్షా తొక్కుతూ పైసలు మిగిల్తే అద్దెగట్టి ఆటో తోల్తా. పైసలు కావాల గానీ పనేదైతే ఏంది సారూ ? నీతి తప్పకుండా బతకాల గంతే. వస్త సారూ, సెంటర్లోకి పోతే గిరాకులు దొరుకుతయ్" శెలవు తీసుకున్నాడు ఎల్లమంద.

జ్ఞానబోధ చేసిన గురువులా అన్పించాడు ఎల్లమంద ఆ క్షణంలో సత్యానికి. చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం కోసం వెంపర్లాడాడే కానీ, పొట్ట నింపడానికి మరో దారి వెతకలేదేనాడు. తండ్రికి సాయం చేద్దామన్న ఆలోచన వున్నా, మార్గం తెలియక కుమిలి పోతున్నాడిన్నాళ్ళూ. చచ్చే ఆలోచనలొచ్చాయే తప్ప, బ్రతికే ఆలోచన ఎందుకు రాలేదో తనకి, తర్కించుకోసాగాడు తనలో తానే.

"శాస్త్రిగారి తాలూకా బాబు ?" నీరుకావి పంచెకట్టిన ఓ నడివయసాయన అడిగాడు సత్యాన్ని సమీపిస్తూ. ఆయన వెంట మరో నలుగురు మనుషులున్నారు. అర్థం కాలేదు సత్యానికి. తండ్రి పేరు శాస్త్రి. కాని ఈయనెవరు ! అనాలోచితంగానే అవునన్నట్లు తల వూపాడు.

"అయితే. పద ! పద ! నేరేడుమెట్ పోవాలి మనం. రాత్రి ఎనిమిదింటికల్లా సిద్ధం చెయ్యాలి. సర్వింగ్ బాయ్‌ని పంపుతాను అన్నాడు శాస్త్రి. నువ్వే అనమాట". తన దోవన తను మాట్లాడుతూనే ఆటో పిలిచి అందర్నీ ఎక్కించాడు ఆయన.

ఆటోలో కూర్చున్న సత్యానికి వాళ్ళ మాటల్ని బట్టి అర్థం అయిందేమిటంటే, వాళ్ళు వంటవాళ్ళు. వాళ్ళు

వడ్డించడానికి మనుషులు కావాలంటే, శాస్త్రి అనే వ్యక్తి వీళ్ళకి ఓ వ్యక్తిని పంపుతాను అని మాట ఇచ్చాడు. ఆ వ్యక్తి తనే అని వీళ్ళనుకుంటున్నారు. అదీ సంగతి.

ఏదయితేనేం? ఆ రాత్రి ఫంక్షన్‌లో వడ్డించినందుకు గానూ వందరూపాయలు సంపాదించాడు సత్యం. మొట్టమొదటి సంపాదన, ఎంత అపురూపంగా వుందో.

ఇక ఆ సీజనంతా ఫంక్షన్లే. ఒక్కరోజు కూడా ఊరికే కూర్చోలేదు. చావు గురించే కాదు, బ్రతుకు గురించి కూడా ఆలోచించే సమయం మిగల్లేదు. తండ్రి వారించినా వినలేదు సత్యం.

సర్వింగ్ నించి వంటపనిలోకి మారాడు. చిన్నపుడు అమ్మ వెంట, వెంట తిరిగి అన్నీ చూసేవాడు కావడంతో అభిరుచి కలిగిన వంటవాడుగా పేరొచ్చేసింది అతి త్వరలోనే.

వంటపనికి 'క్యాటరింగ్' అన్న అందమైన పేరుండడంతో పాటు ఆ వృత్తికి గౌరవం, ఆదాయం కూడా పెరిగింది. కాలంతో పాటుగా వ్యవస్థలూ మారుతున్నాయ్. పద్ధతులూ మారుతున్నాయ్. వేగం పెరిగిన జీవనశైలిలో, వృత్తి ఏదైనా సరే ! అందులో నాణ్యత కనిపిస్తే చాలు అవకాశాలు అందుతూనే ఉన్నాయి. వాటిని అందుకునే చాకచక్యం కొరవడకుండా వుంటే విజయం తథ్యం.

రెండేళ్ళలో ఎన్ని మార్పులొచ్చాయ్. సత్యం స్వంతంగా క్యాటరింగ్ మొదలుపెట్టాడు. తోటి వ్యక్తి చెల్లెల్నే ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాడు. అందం, అణుకువ, నేర్పరితనం, అన్నింటికన్నా మించి కలివిడిగా వుండే తత్త్వం వున్న పిల్ల సీత, అందుకే తండ్రి పోయాక, తల్లినీ, చెల్లినీ అక్కున చేర్చుకుని అండగా నిలవగలిగాడు సత్యం.

పేరున్న క్యాటరర్స్ సరసన చేరింది 'సీతా క్యాటరర్స్' కూడా. తనకి మాత్రమే తెలిసిన స్పెషల్ స్వీట్‌ని కాంప్లిమెంట్‌గా వడ్డిస్తాడు సత్యం ప్రతి ఫంక్షన్‌లోనూ. అదొక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిజాయితీ, సమయపాలన అతని ఆదాయాన్ని ఇతోధికంగా పెంచింది. పదిమందికి ఉపాధి కల్పించింది. ఈరోజు సత్యం కోటీశ్వరుడు కాకపోవచ్చు కానీ కోటి రూపాయిలిచ్చే ఆనందం కన్నా ఎక్కువ సంతృప్తిని స్వంతం చేసుకున్నాడు.

✤ ✤ ✤

"బావుంది నాన్నా కథ" తృప్తిగా అన్నాడు శివ.

"కథ కాదు కాబట్టే బావుందిరా నాన్నా" చిరునవ్వు నవ్వుతూ అంది సీత.

"మరి !" ఆశ్చర్యపోయాడు శివ.

"ఆ నాటి సత్యమే, ఈ నాటి సత్యనారాయణ మూర్తి. మీ బంగారు నాన్న" భర్తని మురిపెంగా చూస్తూ అంది సీత.

ఆ బలహీన క్షణంలో, క్షణికావేశంతో జీవితాన్ని ముగించి వుంటే ఇంత అందమయిన జీవితాన్ని కోల్పోయేవాడు కదూ.

చల్లని మనసున్న అమ్మ, చక్కని భార్య, పిల్లలూ, ఈ చిన్నారి పొదరిల్లు అన్నింటినీ కోల్పోయేవాడు కదూ. గతం తాలూకు ఆలోచనలతో గుండె బరువెక్కింది మూర్తికి.

"అదిగో నాన్నా ! చందమామ మబ్బుల్లోంచి బయటికొచ్చేశాడు చూడు. ఇందాకటికన్నా కాంతివంతంగా వున్నాడు కదూ" ఆనందంగా అంది చిన్నారి.

అచ్చం తన జీవితం లాగే అనిపించాడు చందమామ సత్యానికి. తృప్తిగా పడుకున్న అతణ్ణి, నిద్రాదేవి ఆప్యాయంగా కౌగిలించుకుంది. మబ్బు విడిన చందమామ ఆ పొదరింటి మీద వెన్నెలని, విరివిగా విరజిమ్మింది.

"సింగిల్ పన్నా గేయాలు రాసే రోజుల్లోనే ఒకసారి అడివి బాపిరాజుగారు భీమవరంలో ఒక కవిసమ్మేళనం ఏర్పాటు చేశారు. అందులో నేను కవితాపఠనం చేస్తూ ఉంటే వెనక నుంచి ఒక పదిపన్నెండేండ్ల కుర్రాడు, "ఓస్, ఇదే కవిత్వం అంటే ఇలాంటిది నేనూ రాసెయ్యగలను" అనడం వినిపించింది. ఆ వయస్సు కుర్రాడిచేత అలా అనిపించగల కవిత్వం వ్రాసినందుకు ఇప్పటికీ నేను గర్విస్తున్నాను."

-శ్రీశ్రీ